705) వరాళి

ప॥ కలిమిలేములెల్లా కాలముస్వభావము। తలపులో జ్ఞానము దక్కొడి దొకటే॥

చ॥ పుట్టుగులు జీవునికి పూచినస్వభావము। వొట్టి యిదె సారెసారె వోమనేలా।
పట్టి నానాటిబ్రదుకు ప్రపంచముస్వభావము। కొట్టగొన హరి ముక్తిగోరెటి దొకటే॥

చ॥ మక్కువసంసారముమాయలస్వభావము। చిక్కి కన్నవారికెల్లా మొక్కుకోనేలా।
తక్కక రక్షించేడి దైవముస్వభావము। నిక్కపువైరాగ్యము నిలుచుట వొకటే॥

చ॥ కప్పినభోగములెల్లా కర్మస్వభావము। తప్పక ప్రియముచెప్పేదైన్యమేలా।
యెప్పుడు శ్రీవేంకటేశ యెదలో నాకుగలవు। చప్పుడు సేయక నీకు శరణనే దొకటే॥